

# తొంబైల్లోనూ చెదరని అందం నానమ్మది!

**బాలీవుడ్** నటి ప్రియాంక చోప్రా తన నానమ్మ వృద్ధాప్యంలోనూ ఎంతో అందంగా ఉండేదని, ఆమె సౌందర్య రహస్యం ఏమిటి అన్నది ఇటీవల మీడియాతో పంచుకుంది. '94 ఏండ్ల వయసులో చనిపోయేనాటికి కేవలం ఓ మూడు నాలుగు గీతలు ఆమె ముఖం మీద కనిపించేవి అంతే...' అంటూ తన నానమ్మను గుర్తు చేసుకుంది. తన సౌందర్య పోషణ విషయంలోనూ అమ్మానాన్నలతోపాటు ఆమె ముద్ర కూడా ఉందని చెప్పింది. 'నేను ఉమ్మడి కుటుంబంలో పెరిగాను. నాన్న సహా అందరూ తమ శరీరం పట్ల శ్రద్ధ తీసుకునేవారే. మా ఇంట్లో ఒంటిని శుభ్రం చేసుకునేందుకు రకరకాల పిండ్లు, పసుపు, పెరుగుల మిశ్రమాన్ని ఉపయోగించేవారు. ఇది ఇప్పటికీ నేను కూడా వాడతాను. ఇక, మా నానమ్మ సౌందర్య రహస్యమైతే ట్యూబుల్లోనో, డబ్బాల్లోనో కాదు, నూనె సీసాలో ఉండేది. ఆమె తరచూ ఒళ్లంతా కొబ్బరినూనె రాసుకునేది. తొంబైల్లోనూ ఆమె ముఖం మీద ముడతలు కనిపించకపోవడానికి ఇదే కారణమని అనుకుంటా' అని సింపుల్ బ్యూటీ హ్యాక్‌ను పంచుకుంది. చర్మ సౌందర్యం కోసం పది అంచెల బ్యూటీ రొటీన్‌లు, మిరాకిల్ క్రీమ్‌ల లాంటివి వాడుతున్న ఈ సమయంలో ఇలాంటి చిట్కాలు నిజంగా ఆసక్తికరంగానే కనిపిస్తాయి.

నమస్తే తెలంగాణ
జిందగీ
ఆదివారం | 11 మే 2025
హైదరాబాద్ | www.ntnews.com




**భరతమాత ముద్దుబిడ్డలు మన సైనికులు.**
**ఆ వీరమల్లులకు జన్మనిచ్చిన తల్లులే అసలైన ముద్దుబిడ్డలు.**

మన దేశ రక్షణ కోసం.. కన్నప్రేమను పణంగా పెట్టిన వీరమాతలు వీళ్లు. ఇప్పుడు ఆ మాతృమూర్తుల గుండెల్లో సాగుతున్న సమరం... సరిహద్దుల్లో యుద్ధానికేం తీసిపోదు. నవ మాసాలు తన గర్భాలయంలో నిశ్చింతగా ఉన్న బిడ్డ.. పొత్తిళ్లలో తొలిసారి కన్ను తెరిచిన బిడ్డ.. క్షణకాలం పాలు ఇవ్వడం ఆలస్యమైతే గుక్కపట్టి ఏడ్చిన బిడ్డ.. ఇప్పుడు ఎలా ఉన్నాడో.. ఏ దిక్కు నుంచి ఏ ఆపద ముంచుకొస్తుందో.. అని ప్రతిక్షణం కకావికలం అవుతుందా తల్లి. 'బెంగ పడకమ్మా! మై జరూర్ వాపస్ ఆవూంగా' అంటూ యుద్ధానికేగుతూ తన బిడ్డ ఇచ్చిన మాటనే నమ్ముకొని.. నిరీక్షిస్తుంటుంది. తల్లడిల్లుతున్న ఆ తల్లి మనసు కుదుటపడటమే అసలైన మాతృదినోత్సవం.

# అసలైన ముద్దుబిడ్డ అమ్మే

**కాన్పు...** జీవన్మరణ సమరం!
ఆ యుద్ధాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుని అమ్మగా గెలుస్తుంది.
అడ్డాల బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకుంటూ మరో సమరం సాగిస్తుంది.
లాలించి ఒకసారి, బెదిరించి ఇంకోసారి అమ్మే గెలుస్తుంది.
తన బిడ్డను ప్రయోజకుణ్ని చేసే వరకు అమ్మ పోరాడుతూనే ఉంటుంది.
బిడ్డ తన సొంతకాళ్లపై నిలబడి, ఆదర్శంగా జీవనం సాగించేదాకా అమ్మ బతుకు నిత్య సంగ్రామమే!
ఇది అందరి విషయంలో జరిగేదే! కానీ, వీర సైనికులను దేశానికి అందించిన వీరమాతల పోరాటం మాటేమిటి? సరిహద్దుల్లో సైరన్ మోగిన ప్రతిసారీ.. అమ్మ గుండె వేగం పెరుగుతుంది. అధికారుల నుంచి పిలుపు వచ్చినప్పుడల్లా.. హైరానా పడిపోతుంది. క్షేమంగా వెళ్లిన బిడ్డ.. ప్రాణాలతో వస్తే చాలని ముక్కోటి దేవుళ్లనూ ప్రార్థిస్తుంది.

విచక్షణ లేని శత్రుదేశం దొంగ యుద్ధానికి పాల్పడుతుంటే.. తన బిడ్డ పద్మవ్యూహంలో చిక్కుకున్నాడా అని సందేహిస్తుంది తల్లి. ఫోన్ మోగితే చాలు.. తన పక్కనే మిసైల్ పడినంతగా ఇదైపోతుంది. కానీ, ఆ అమ్మ ఉగ్గుపాలతో నూరిపోసిన ధైర్యం అక్కడ సైనికులకు రక్షణ కవచం. బువ్వ పెడుతూ ఆమె చెప్పిన వీరగాథలే వాళ్లకు శక్తి. అన్నిటినీ మించి.. అమ్మ చూపిన ఆప్యాయత, ఆమె పంచిన ప్రేమ మన సైన్యానికి ఆదరువు. తనకు వీడ్కోలు పలికేటప్పుడు.. నుదుటిపై చేయి పెట్టి అమ్మ అందించిన దీవెన.. బ్రహ్మాస్త్రాన్ని సైతం నిర్వీర్యం చేస్తుందన్న నమ్మకం వారిది. అయితే, తనకు ఉన్నవన్నీ బిడ్డకు ఇచ్చేసిన అమ్మకు యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రతిసారీ కఠోర పరీక్షే. అలాంటి విపత్కర పరిస్థితులు ఎన్ని ఎదురైనా, అన్నిసార్లూ తన కొడుకో, కూతురో యుద్ధం నుంచి క్షేమంగా తిరిగి వచ్చినా.. అమ్మను ఏదో భయం వెంటాడుతూనే ఉంటుంది. చిన్నప్పుడు ఎన్ని గండాలు దాటలేదు.. ఇదీ అంతే అని తనకు తాను ధైర్యం చెప్పుకొంటుంది.

బిడ్డ సైన్యంలో చేరితే ఇలాంటి రోజు వస్తుందని ఆ తల్లి ఊహించకుండా ఉండదు! తాను సైన్యంలో చేరుతానని కొడుకు కోరిన క్షణంలోనే ఆమె గుండె అగ్నిపర్వతంలా బద్ధలవుతుంది. కానీ, చిన్నప్పటి నుంచి వీరగాథలు చెప్పి పెంచిన తాను.. కొడుకు కోరికకు అడ్డు చెప్పడం ఏంటని మనసులోనే అనుకొని ఆల్ ద బెస్ట్ చెబుతుంది. కొందరి విషయంలో మరోలా ఉంటుంది. కొడుకో, కూతురో ఆర్మీలో చేరడానికి ఉత్సాహం చూపుతున్నారని తెలియగానే సత్యాగ్రహం ప్రకటిస్తుంది. మౌనవ్రతం పాటి



స్తుంది. తల్లిని బుజ్జగించో, విషయం దాచిపెట్టో వాళ్లు సైన్యంలో చేరిపోతారు. తర్వాత ఎప్పటికో విషయం తెలిసిన తల్లి పైకి నవ్వు ముఖంతో అభినందనలు తెలిపినా.. లోలోపల కుమిలిపోతుంది. ఆ రోజు నుంచి తన కన్నపేగు కదిలిపోతున్నట్టుగా కంగారుపడిపోతుంది. సెలవుల్లో వచ్చి డ్యూటీకి వెళ్తున్న ప్రతిసారీ నవ్వుతూ వీడ్కోలు పలికినా.. వాళ్లు కనుమరుగు కాగానే, పొగిలి పొగిలి దుఃఖిస్తుంది. ఆ అమ్మే.. 'నువ్వు ఈసారి వెళ్లడానికి వీల్లేదని భీష్మిస్తే! లక్ష్మణ రేఖ గీస్తే! ఆర్మీ క్రమశిక్షణలో ఎంత రాటుదేలినా.. తల్లికి బిడ్డే కదా! ఆ మాతృమూర్తి ఆవేదనకు కరిగిపోతే.. సెలవుల్లో ఇండ్లకు వెళ్లిన సైనికుల్లో ఎంతమంది తిరిగి విధుల్లో చేరుతారో ఊహించడం కష్టమే! కానీ, ఆమె వీరమాత.. బిడ్డను దేశానికి అంకితం చేసింది. తల్లిని కన్న కన్నభూమిని తల్లి కన్నా మిన్నగా ప్రేమిస్తున్న సైనికుడికి జన్మనిచ్చినందుకు గర్విస్తుంది. పొరుగు దేశాలతో.. ఎప్పుడు యుద్ధం జరిగినా మనం గెలుపొందడం వెనుక ఈ తల్లుల అవ్యాజమైన దేశభక్తే ప్రధాన కారణం. ఆ వీరమాతలకు వందనాలు సమర్పించుకుందాం. మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేద్దాం!



**ఆపరేషన్ సిందూర్..**

**ఈ పేరులోనే ఏదో వైబ్రేషన్ ఉంది. విన్న ప్రతీ భారతీయుని గుండె.. విజయగర్వంతో ఉప్పొంగిపోతున్నది. అందుకే, ఈ టైటిల్ హక్కుల కోసం భారతీయ సినీ నిర్మాణ సంస్థలు పోటీ పడుతున్నాయి. ఇంతకుముందు కూడా.. సర్జికల్ స్ట్రయిక్స్, ఉరీ, ఎల్‌వోసీ కార్గిల్, ఘాజీ, మేజర్, తేజస్ లాంటి ఎన్నో పేర్లు భారతీయుల మనసులో చెరగని ముద్ర వేశాయి. అందుకే, ఆయా పేర్లతో టాలీవుడ్ నుంచి బాలీవుడ్ దాకా ఎన్నో సినిమాలు తెరకెక్కాయి. రియల్ లైఫ్ హీరోల జీవితాలను వెండితెరమీద సగర్వంగా ఆవిష్కరించాయి. ఈ చిత్రాలు యుద్ధం అంటే ఎలా ఉంటుందో కళ్లకు కట్టాయి. భారత సైనికుల గొప్పదనాన్ని దశదిశలా చాటిన అలాంటి కొన్ని సినిమాల గురించి..**

# యుద్ధం.. చిత్రం.. విజయం!

### ఎల్ ఓసీ కార్గిల్

1999లో భారత్ – పాకిస్థాన్ మధ్య కార్గిల్ యుద్ధం జరిగింది. కొందరు పాకిస్థాన్ సైనికులు మారువేషాల్లో నియంత్రణ రేఖను దాటి భారత్‌లోకి చొచ్చుకువచ్చారు. కార్గిల్‌లో ఖాళీగా ఉన్న భారత భూ భాగాలను ఆక్రమించారు. అలర్ట్ అయిన భారత్.. ఆపరేషన్ విజయ్ చేపట్టింది. ఇండియన్ ఆర్మీ ఎదురుదాడికి దిగి.. పాకిస్థాన్ సైన్యాన్ని తరిమి తరిమికొట్టింది. ఈ యుద్ధంలో 527 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భారత రక్షణ సిబ్బంది కెప్టెన్ విక్రమ్ బాత్రా, సుబేదార్ యోగేంద్ర సింగ్ యాదవ్, మేజర్ దీపక్ రాంపాల్ జీవితాలతో కార్గిల్ యుద్ధం నేపథ్యంతో 'ఎల్‌ఓసీ కార్గిల్' చిత్రం తెరకెక్కింది. మంచు కొండల్లో భారతీయ సైనికులు చూపిన తెగువ, వారి ధైర్యసాహసాలను వెండితెరపై ఆవిష్కరించింది. సంజయ్ దత్, అయూబ్ ఖాన్, సునీల్ శెట్టి, సైఫ్ అలీఖాన్, అభిషేక్ బచ్చన్ లాంటి అగ్రతారలు నటించిన ఈ చిత్రానికి జేపీ దత్తా దర్శకత్వం వహించారు.

### ద ఘాజీ అటాక్

1971లో తూర్పు పాకిస్థాన్ విముక్తి యుద్ధం సందర్భంగా.. భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు తారాస్థాయికి చేరాయి. భారత్‌ను దొంగదెబ్బ తీయడానికి పాకిస్థాన్ నావికాదళం రహస్య మిషన్ చేపట్టింది. భారత నౌకా దళానికి చెందిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను నాశనం చేసేందుకు పీఎన్ఎస్ ఘాజీని పంపింది. అయితే, భారతీయ జలాంతర్గామి ఐఎన్ఎస్ కరంజ్ (ఎస్21).. ఘాజీని అడ్డుకొని విశాఖ తీరంలో జలసమాధి చేసింది. ఈ సంఘటన ఆధారంగా 'ద ఘాజీ అటాక్' చిత్రం తెరకెక్కింది. భారత సినీ చరిత్రలోనే తొలి అండర్‌వాటర్ వార్ సినిమాగా నిలిచింది. పీఎన్ఎస్ ఘాజీని అడ్డుకోవడానికి సముద్రపు అడుగున భారత నేవీ అధికారులు చేసిన సాహసాన్ని వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించాడు తెలుగు దర్శకుడు సంకల్ప్ రెడ్డి. ఈ చిత్రంలో రానా దగ్గుబాటి, అతుల్ కులకర్ణి, కే మేనన్, తాప్సీ పన్ను, సత్యదేవ్ కీలక పాత్రల్లో మెప్పించారు.

### బోర్డర్

1971 ఇండో–పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో వచ్చిన మరో సినిమా.. బోర్డర్. రాజస్థాన్ థార్ ఎడారిలోని లోంగేవాలా సరిహద్దు వద్ద జరిగిన ఘర్షణను ఈ చిత్రం కండ్లకు కడుతుంది. భారత్‌కు చెందిన లోంగేవాలా బెటాలియన్‌లో కేవలం 120 మంది సైనికులు మాత్రమే ఉంటారు. వారిపై సుమారు మూడువేల మంది సాయుధులతో కూడిన పాకిస్థాన్ సైన్యం.. ట్యాంకులతో దాడికి దిగుతుంది. మేజర్ కుల్‌దీప్ సింగ్ చాంద్‌పురి నేతృత్వంలోని భారత సైనికులు.. వారిని ధైర్యంగా ఎదిరించి నిలబడతారు. మేజర్ చాంద్‌పురి తన బలగాన్ని సమర్థంగా వినియోగించుకొని, మరిన్ని భారత బలగాలు వచ్చేంత వరకూ పాకిస్థాన్ దళాన్ని అడ్డుకుంటాడు. వేలమంది సాయుధులు, 20–30 యుద్ధ ట్యాంకులతో వచ్చిన పాకిస్థాన్ ఆర్మీతో కేవలం 120 మంది భారత సైనికులు ధైర్యంగా చేసిన పోరాటాన్ని 'బోర్డర్' చిత్రంలో చక్కగా చూపించాడు దర్శకుడు జేపీ దత్తా. ఈ సినిమాలో సన్నీ డియోల్, జాకీ ష్రాఫ్, సునీల్ శెట్టి, అక్షయ్ ఖన్నా లాంటి బాలీవుడ్ అగ్రనటులు నటించారు.

### ఉరీ: ద సర్జికల్ స్ట్రయిక్

**2016లో** జమ్మూ కశ్మీర్‌లోని ఉరీ సెక్టార్‌లో ఉన్న భారత సైనిక స్థావరంపై ఉగ్రవాదులు దాడి చేశారు. 19 మంది భారతీయ జవాన్ల ఉసురుతీశారు. దీనికి ప్రతిగా.. భారత సైన్యం సర్జికల్ స్ట్రయిక్స్ చేపట్టింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోకి వెళ్లి ఉగ్రమూకల పనిపట్టింది. టెర్రరిస్టులకు భారత ఆర్మీ దెబ్బను రుచి చూపించింది. ఈ సర్జికల్ స్ట్రయిక్స్ ఆధారంగానే 'ఉరీ: ద సర్జికల్ స్ట్రయిక్' చిత్రం తెరకెక్కింది. ఆదిత్యధర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో విక్కీ కౌశల్, పరేష్ రావల్, యామీ గౌతమ్, కీర్తి కుల్హరి ముఖ్య పాత్రలు పోషించారు. మేజర్ విహాన్ శెర్గిల్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం రెక్కీ ఆపరేషన్, ప్లానింగ్‌తోపాటు ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడం, ఈ మిషన్ వెనక ఉన్న మిలిటరీ సన్నద్ధతను ఇందులో కళ్లకు కట్టినట్టు చూపించారు.



### మేజర్

2008 నవంబర్‌లో దేశ ఆర్థిక రాజధాని ముంబయిపై దాడిచేసింది పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రమూక. అనేకమంది అమాయకుల ప్రాణాలను బలితీసుకున్నది. అలాంటి విపత్కర సమయంలో తన ప్రాణాలు కూడా లెక్కచేయకుండా పోరాడి వీరమరణం పొందాడు మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్. ఆయన జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన సినిమా.. 'మేజర్'. టాలీవుడ్ మోస్ట్ టాలెంటెడ్.. అడివి శేష్ స్వయంగా ఈ కథను రాసుకోవడంతోపాటు సందీప్ ఉన్నికృష్ణన్ పాత్రలో చక్కగా ఒదిగిపోయాడు. శశికిరణ్ తిక్క దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో.. మేజర్ సందీప్ బాల్యం నుంచి దేశం కోసం ప్రాణాల్ని అర్పించడం వరకూ కళ్లకు కట్టారు.

### ఇంకా మరెన్నో..

దేశభక్తి, ప్రతీకారం, సైనికుల త్యాగం నేపథ్యంలో మరెన్నో సినిమాలు తెరకెక్కాయి. దేశ త్రివిధ దళాల ధైర్యాన్ని, వీరత్వాన్ని చాటిచెప్పాయి. 1971, ఐబీ71, తేజస్, ఫైటర్, వీర్ జరా, హిందుస్థాన్ కీ కసమ్, గుంజన్ సక్సెనా: ద కార్గిల్ గర్ల్, పిప్పా, షేర్షా లాంటి మరెన్నో సినిమాలు వెండితెర మీద అలరించాయి. ప్రేక్షకులను మెప్పించడంతోపాటు బాక్సాఫీస్ వద్ద విజయాలనూ అందుకున్నాయి.

...✍ చిల్ల శ్రీనివాస్



# కేరాఫ్ అడ్రస్.. ఆర్మీ!

విజయాలకు, ధైర్య సాహసాలకు చిరునామా.. భారత సైన్యం! అలాంటి 'కేరాఫ్ అడ్రస్' నుంచి వచ్చిన తారల కెరీర్‌కూడా.. అంతే సక్సెస్‌ఫుల్‌గా సాగుతున్నది. జవాన్ల ఇంట పుట్టి, ఆర్మీ పరిసరాల్లో పెరిగి.. సినిమా రంగంలో సత్తా చాటుతున్నారు కొందరు అమ్మాయిలు. టాలీవుడ్ నుంచి బాలీవుడ్, హాలీవుడ్‌లోనూ టాప్ హీరోయిన్లుగా రాణిస్తున్నారు. వారిలో కొందరి పరిచయం..

### రకుల్‌ప్రీత్ సింగ్

తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి.. అగ్రతారగా వెలుగొందింది రకుల్‌ప్రీత్ సింగ్. ఈమెది ఆర్మీ ఫ్యామిలీ! రకుల్ తండ్రి రాజేందర్ సింగ్.. భారత సైన్యంలో ఉన్నతాధికారిగా పనిచేశారు. రకుల్ విద్యాభ్యాసం కూడా ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లోనే సాగింది. అందుకే, అవిశ్రాంతంగా పనిచేయడం, లక్ష్యాలను సాధించేవరకూ పట్టువిడవకపోవడం తనకు బాల్యం నుంచే అబ్బాయని పలు సందర్భాల్లో చెప్పుకొచ్చింది రకుల్.



### సుస్మితా సేన్

1994లో మిస్ యూనివర్స్ టైటిల్ గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా రికార్డు సృష్టించిన సుస్మితా సేన్‌ది ఆర్మీ కుటుంబమే. మోడల్‌గా, ఆ తర్వాత యాక్టర్‌గా కెరీర్ ప్రారంభించింది సుస్మిత. ఈమె తండ్రి షుబీర్ సేన్. వైమానిక దళంలో వింగ్ కమాండర్‌గా పనిచేశారు.



### అనుష్క శర్మ

దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న బాలీవుడ్ అగ్రతార.. అనుష్క శర్మ. ఈమె తండ్రి భారత మాజీ ఆర్మీ అధికారి, కల్నల్ అజయ్ కుమార్ శర్మ. ఈయన ఆపరేషన్ బ్లూస్టార్, కార్గిల్ యుద్ధం సహా అనేక సైనిక కార్యకలాపాల్లో పాల్గొన్నారు. తన తండ్రి కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నప్పుడు చాలా భయపడ్డామనీ, ప్రాణనష్టం గురించి వార్తలు విన్నప్పుడు ఎంతో బాధపడ్డామనీ గతంలో ఎన్నో ఇంటర్వ్యూల్లో చెప్పుకొచ్చింది అనుష్క. సైనికులు, వారి కుటుంబాలు చేసే త్యాగాలను స్వయంగా చూసిన ఈ నటి.. భారత సైన్యానికి ఎప్పుడూ రుణపడి ఉంటామని చెబుతుంది.